21నుంచి శ్రీవారి తిరుమల మహాపాదయాత్ర



శ్రీవారి తిరుమల మహా పాదయాత్రకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కూకట్‌పల్లి: గడపగడపకు గోవు... గోవిందుడు.. గీత అనే నినాదంతో లక్ష్యసాధన ఫౌండేషన్ శ్రీవారి తిరుమల మహాపాదయాత్రను ఈనెల 21వ తేదీ కేపీహెచ్‌బీ కాలనీ నుంచి ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. శ్రీవారి తిరుమల మహా పాదయాత్ర సంకల్ప దీక్షా పారాయణులు శ్రీమాన్ శ్రీగట్టు అరుంధతి రంగాచార్యులు, శ్రీ విజయలక్ష్మి దేవాలయం ప్రధాన అర్చకులు, ఈఎస్ఐ, ఎస్ఆర్‌నగర్ వారు నడుస్తూ భక్తులను ముందుకు నడిపిస్తారని పేర్కొన్నారు.

◆ ఈ కార్యక్రమానికి కార్యనిర్వాహణ శ్రీమాన్ బైలూర్ యోగీష్ ప్రభు, శ్రీమాన్ అచ్యుతరావులు, శ్రీమాన్ తిరుపతిగారి ప్రభాకర్, శ్రీమాన్ బడేసాబ్, భవాని మైలవరపులు సహకార్య నిర్వహణలో ఈ మహా పాదయాత్రను నిర్వహించనున్నారు. స్వామీజీలు, మాతాజీల కోసం, యువతీ, స్త్రీల కోసం ప్రత్యేక వ్యవస్థ ఉంటుందని తెలిపారు. వృద్ధులు, పూర్తిగా నడవలేని వారి కోసం కూడా ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయన్నారు.

◆ ఈ యాత్ర 40 రోజుల పాటు కొనసాగి మార్చి 3వ తేదీన తిరుమలకు చేరుకుంటుందని తెలిపారు. ఈ మహాపాద్రయాతలో తమ వంతు వస్తు, ధన, చెట్ల రూపంలో భాగస్వాములు అవ్వాలనుకునేవారు విరాళం అందించవచ్చన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నం .76800 01295లో సంప్రదించాలని కోరారు.

మోదీ నాయకత్వంలో దేవాలయాలకు పూర్వవైభవం

- కూకట్‌పల్లి రామాలయం ప్రాంగణంలో స్వచ్ఛ భారత్
- పాల్గొన్న మధ్యప్రదేశ్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మురళీధర్





కూకట్‌పల్లి: అయోధ్యలో ఈనెల 22న రామమందిర ప్రారంభోత్సవానికి ముందు భారతదేశంలోని అన్ని దేవాలయాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉండాలన్న ప్రధానమంత్రి మోదీ పిలుపు మేరకు మంగళవారం మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో కూకట్‌పల్లి గ్రామ ప్రజలతో కలిసి కూకట్‌పల్లి రామాలయం ప్రాంగణంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మధ్యప్రదేశ్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మురళీధర్ విచ్చేసి పూజలు నిర్వహించారు. శ్రీ సీతారామచంద్ర స్వామి పల్లకీసేవలో పాల్గొన్నారు. అనంతరం హిందూ బంధువులతో కలిసి ఆలయ ప్రాంగణం అంతా కడిగి శుభ్రం చేశారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో హిందూ దేవాలయాలకు పూర్వవైభవం వస్తోందన్నారు. ఆయన ఇచ్చిన సందేశం మేరకు భారతదేశంలో ఉన్న అన్ని ఆలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

◆ అయోధ్య రామ మందిర నిర్మాణం తిరిగి 500 సంవత్సరాల తర్వాత పూర్తిచేసుకోవడం గొప్ప విషయం అన్నారు. ఈనెల 22న అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని ప్రజలు దీపావళి పండుగలా చేసుకోవాలన్నారు.

◆ ఈ కార్యక్రమంలో నాయినేని సూర్యప్రకాష్ రావు, అర్శనపల్లి సూర్యారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, కొండల్‌రావు, హరిధర్, శ్రీకర్‌రావు, రామాలయ మాజీ అధ్యక్షుడు యాదగిరిరావు, జగదీష్, హరిబాబు, శ్రీనివాస్ గౌడ్, అనంత నాగరాజు, వినోద్ కుమార్ గౌడ్, అర్జున్, శంకర్ చౌదరి, కృష్ణప్రియ, దిలీప్, కూకట్‌పల్లి వాసులు పాల్గొన్నారు.





సంక్రాంతి సంబురాలు

శిల్పారామంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్: కళాకారులు నృత్య ప్రదర్శనలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబురాలలో భాగంగా మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గంగిరెద్దుల ఆటలు, హరిదాసులు, బుడబుక్కలు, జంగమ దేవరలు , పిట్టలదొర, కొమ్ముదాసరుల ఆటలు, పాటలు సందర్శకులను అలరించాయి. బెంగుళూరుకు చెందిన భరతనాట్య కళాకారులు సుప్రియ కొమండూరు శిష్యబృందం, సంతోష్‌కుమార్ తమాంగ్ శిష్యబృందం, ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శనలో తోడయ మంగళం, హనుమాన్ చాలీసా, నటేశకౌతం, తిల్లాన, శివస్తుతి, శబ్దం తదితర అంశాలతో అలరించారు. కలకత్తాకి చెందిన కూచిపూడి కళాకారులు బిరాజ్ రాయ్ బృందం , పూణేకి చెందిన అంజలిరాజు శిష్యబృందం పాండురంగ విఠల్ పాటలకు నృత్యం చేశారు.

వైభవంగా సంక్రాంతి సంబురాలు

సంక్రాంతి, కనుమ సంబురాలను కూకట్‌పల్లి జోన్ పరిధిలోని ప్రజలు వైభవంగా నిర్వహించుకున్నారు. చిన్నారులకు భోగి పళ్లు పోసి ఆనందాన్ని చాటుకున్నారు. అదే విధంగా యువతులు రంగురంగుల రంగవల్లులు వేశారు. కుటుంబ సమేతంగా బిల్డింగ్‌లపై పతంగులను ఎగరవేశారు. – మోతీనగర్



చిన్నారికి భోగి పళ్లను పోస్తున్న కుటుంబీకులు





శ్రీవివేకానందనగర్‌లో పతంగులు ఎగురవేస్తున్న అజీజ్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మోయిజ్, వీ టీమ్ అధ్యక్షుడు డి.మస్తాన్‌రెడ్డి

మోతీనగర్‌లో రంగవల్లులతో చిన్నారులు





సంక్రాంతి మహిళ ముగ్గు ముందు చిన్నారి

శుభాకాంక్షలు



కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంగళవారం కూకట్‌పల్లి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చీటకోరు కృష్ణ, నాయకులు రవూఫ్, అరుణ్, కుమార్, రతికంత్, అరుణ్‌సింగ్, రామారావు, ఏడుకొండలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకంక్షలు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



మూసాపేట: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం, శిలగూడకు చెందిన రామారావు, ప్రవీణ్, చంటిలు తమ స్వస్థలం నుంచి కూకట్‌పల్లికి నిర్మాణ పనుల కోసం వచ్చారు. ఈనెల 5వ తేదీన భాగ్యనగర్‌కాలనీలో కూరగాయలను కొనటానికి వెళ్లారు. అనంతరం రామారావు కనిపించలేదు. ఇంటికి వెళ్తాడనుకున్నారు. కానీ ఇంటికి వచ్చి చూశాక రామారావు కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన వారు పరిసర ప్రాంతాలు వెతికినా ఆచూకీ లభించకపోవటంతో కూకట్‌పల్లి పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆటో నుంచి రోడ్డుపై పడిన మహిళ

తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి

జగద్గిరిగుట్ట: ఆటో నుంచి ఓ మహిళ రోడ్డుపై పడటంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆల్విన్‌కాలనీ ప్రధాన రోడ్డులో మంగళవారం మధ్యాహ్నం ఆటో నుంచి ఓ మహిళ రోడ్డుపై పడింది. ఈ ఘటనలో సదరు మహిళ తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌ను జగద్గిరిగుట్ట పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా సదరు మహిళకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని, పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విగ్రహం కూల్చిన వారిని కఠినంగా శిక్షించాలి



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండలోని తెలంగాణ ఉద్యమ సిద్ధాంత కర్త, తెలంగాణ ఆత్మ గౌరవాన్ని తట్టి లేపిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తి ధ్వంసం చేశాడు. మద్యం మత్తులో పెద్ద బండరాయితో జయశంకర్ విగ్రహాన్ని పగలగొట్టాడు. ఈ సంఘటనను ఖండిస్తూ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితులను పరిశీలించారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విగ్రహాన్ని పగలగొట్టడం బాధాకరమైన విషయమన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఏ చిన్న పొరపాటు కూడా జరగకుండా జాగ్రత్త పడ్డామన్నారు. విగ్రహం పగలగొట్టిన వ్యక్తి ఎవరైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేవారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం వెంటనే ప్రొ. జయశంకర్ విగ్రహాన్ని అదే స్థలంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



ఎల్లమ్మబండలో తాగిన మైకంలో విగ్రహాన్ని ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తి



విగ్రహం పగలగొట్టిన వ్యక్తిని అరెస్టు చేయాలని ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్

విద్యా విధానంలో మార్పులు వస్తున్నాయి

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఓరియంటేషన్, సెన్సిటైజేషన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని మాలవీయ మిషన్ టీచర్స్ ట్రెనింగ్ సెంటర్ (ఎంఎంటీటీసీ) ఆధ్వర్యంలో ఎన్ఈపీ–2020పై ఫ్యాకల్టీ ప్రతినిధులకు మరింత అవగాహన కల్పించేందుకు ఆన్‌లైన్ ద్వారా ఈ కార్యక్రమాన్ని వారం పాటు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నూతన జాతీయ విద్యావిధానంలో విద్యా సంస్కరణలు, సమాచార, కమ్యూనికేషన్ టెక్నాలజీ వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూజీసీ–ఎంఎటీటీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సనీమ్‌ఫాతిమా మాట్లాడుతూ ప్రస్తుతం విద్యా విధానంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గూగుల్ యుగంలో కూడా ప్రతి ఒక్కరికి సమూల మార్పులపై అవగాహన ఉండాల్సిన అవసరం ఉందన్నారు. విద్యాబోధనలో కూడా నూతన మార్పులకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఓరియంటేషన్ కార్యక్రమం జనవరి 25వ తేదీ వరకు కొనసాగుతుంది. కార్యక్రమంలో పలువురు 'మనూ' అధికారులు, యూజీసీ– ఎంఎంటీటీసీ అధికారులు, దేశ వ్యాప్తంగా 130 మంది పైగా పాల్గొన్నారు.

ఎన్ఈపీ-2020పై మరింత అవగాహన అవసరం



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్

రాయదుర్గం: నూతన జాతీయ విద్యావిధానం -2020పై అవగాహన అవసరమని మనూ వీసీ ప్రొ.సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్(ఎస్ఈ అండ్‌టీ), ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(ఐటీఈపీ) ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీసీ ఎన్ఈపీ–2020లోని మార్గదర్శకాలను వివరించారు. ఐటీఈపీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ చంద్‌కిరణ్‌సలూజా మాట్లాడుతూ పిల్లల సామర్థ్యాన్ని గమనించడం, అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఈ అండ్ టీ డీన్ ప్రొ. వనజ రచించిన పుస్తకాలను ఈ సందర్భంగా వీసీ ఐనుల్ హసన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 'మనూ' రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ఎస్ఈ అండ్ టీ విభాగం అధిపతి ప్రొఫెసర్ షాహీన్ అల్తాఫ్‌షేక్ ప్రసంగించారు. కాగా ఎన్‌సీటీఈ బృందం ఉర్దూ విశ్వవిద్యాలయంలో పర్యటించారు. బృందం సభ్యులు మదన్ యాదవ్, పూజా శర్మ, అనిల్‌కుమార్, అభిమన్యుయాదవ్, దినేష్ చతుర్వేది, ఫ్యాకల్టీ సభ్యులు యూనివర్శిటీ క్యాంపస్‌ను సందర్శించారు. అనంతరం క్యాంపస్‌లో మొక్కలు నాటారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



రాయదుర్గం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో భోగి, మకర సంక్రాంతి, కనుమ పండగ సందర్భంగా అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కాశీవిశ్వేశ్వరస్వామి, అన్నపూర్ణాదేవి, గణపతి, షిర్డీ సాయిబాబా, ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక అలంకారం చేశారు. జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి, రాయదుర్గంలోని వెంకటేశ్వరస్వామి, లక్ష్మీనర్సింహస్వామి, ఆంజనేయస్వామి, ఊర పోచమ్మ, నానక్‌రాంగూడ, గోపన్‌పల్లిలోని రంగనాథస్వామి ఆలయాల్లో, ఆంజనేయస్వామి ఆలయం, గౌలిదొడ్డిలోని శివాలయం, సాయిఐశ్వర్య కాలనీలో అమ్మవారికి, శివుడికి, కొత్తగూడ, కొండాపూర్, ఇందిరానగర్, ఎన్టీఆర్‌కాలనీ, గోపన్‌పల్లితండాలోని ఆలయాల్లో పూజలు చేశారు.



శివసాయిక్షేత్రంలో..



అన్నపూర్ణాదేవి

తాగునీరు కలుషితం

- వాల్వ్‌ల లీకేజీలకు తాత్కాలిక మరమ్మతులు
- తరచూ పునరావృతం అవుతున్న సమస్య
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు



జగద్గిరిగుట్ట ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద లీకేజీ



ఆస్‌బెస్టాస్ కాలనీలోని స్వీట్‌షాపు ఎదుట



ఆల్విన్‌కాలనీ ఫేజ్-1 ఆంజనేయస్వామి ఆలయం వద్ద..

ఆల్విన్‌కాలనీ: తాగునీటి పైపులైన్ల లీకేజీల నివారణలో జలమండలి అధికారులు తగు చర్యలు తీసుకోకపోవడంతో కలుషిత నీరు సరఫరా అవుతోంది. లీకేజీలతో నీరు రోడ్డుపై పారుతుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీ, జగద్గిరిగుట్ట ఇందిరాగాంధీ చౌరస్తా, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1, ఆంజనేయస్వామి ఆలయం వద్ద పలు ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్ స్లూకల వాల్వ్‌ల లీకేజీతో లక్షలాది గ్యాలన్ల నీరు రోడ్లపై పారుతోంది. కొన్ని నెలలుగా లీకేజీతో తాగునీరు వృథాగా పోతున్నా సంబంధిత శాఖ అధికారులకు పట్టడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

◆ జగద్గిరిగుట్ట ఇందిరాగాంధీ చౌరస్తాలో కొన్ని నెలలుగా చెత్తా చెదారం చేరడంతో బాటు నీరు వృథాగా పోతున్నా పట్టించుకున్న వారు లేరని స్థానికులు వాపోతున్నారు. ఆల్విన్‌కాలనీ ఆంజనేయస్వామి ఆలయం ముందు గత కొద్దిరోజుల క్రితం తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. వారం రోజులు గడవక ముందే మళ్లీ ప్రధాన పైపులైన్ లీకేజీ అయిందని స్థానికులు తెలిపారు.

◆ ఆస్‌బెస్టాస్ కాలనీ ప్రధాన చౌరస్తాలోని స్వీట్ షాపు ముందు పైపులైన్ వాల్వ్ లీకేజీ వల్ల రహదారిపై నీరు ప్రవహిస్తుండడంతో రహదారి గుంతలమయం కావటంతో పాటు ప్రయాణికులకు అసౌకర్యంగా ఉంటోందని విమర్శిస్తున్నారు. సమస్య పదేపదే పునరావృతమవుతున్నా జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక సంక్షేమ సంఘ సభ్యులు అంటున్నారు. జలమండలి అధికారుల నిర్లక్ష్యం కారణంగా వృద్ధులు, చిన్నారులు అనారోగ్యం పాలై ఆస్పత్రి పాలవుతున్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు నిర్లక్ష్యం వీడి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

'మనూ' దూరవిద్య ఫలితాలు విడుదల

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో దూర విద్యా కోర్సుల ఫలితాలను విడుదల చేశారు. సెప్టెంబర్/అక్టోబర్–2023 నెలలో నిర్వహించిన ఓడీఎల్ కోర్సుల ఫలితాలను ప్రకటించారు. దూర విద్యాకోర్సులలో ఎం.ఏ. బీఎస్సీ, బీకామ్, డిప్లమో ఇన్ జర్నలిజమ్ అండ్ మాస్ కమ్యూనికేషన్, డిప్లమో ఇన్ టీచ్ ఇంగ్లిష్ వంటి కోర్సుల ఫలితాలను ప్రకటించారు. యూనివర్శిటీ వెబ్‌సైట్‌లో చూడాలని అధికారులు సూచించారు.

కమనీయం.. గోదాదేవి కల్యాణం



బంజారాహిల్స్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఫిలింనగర్ దైవ సన్నిధానంలో గోదా రంగనాథస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామి కల్యాణ క్రతువు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కోశాధికారి కాజా సూర్యనారాయణతో పాటు పలువురు ప్రముఖులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

ఐక్యంగా హక్కుల సాధనకు కృషి చేద్దాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం అయన నివాసంలో పెన్నార్ పరిశ్రమ యూనియన్ నాయకులతో త్వరలో జరగనున్న యూనియన్ ఎన్నికలపై సమావేశమయ్యారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధనకు కృషి చేయాలని తాము ఎప్పుడూ అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు.

కుక్కల బెడద

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరులో కుక్కల బెడద ఎక్కువైందని ప్రజలు వాపోతున్నారు. సోమవారం పటాన్‌చెరు జేపీకాలనీ రోడ్ నెంబర్ –3 లో ఇద్దరు బాలికలపై కుక్క దాడి చేసింది. మరో ఘటనలో సాయిరాం కాలనీ రోడ్ నంబర్ 7 లో ఇద్దరిపై దాడి చేశాయి. కాగా కొద్ది రోజుల క్రితం ఆల్విన్ కాలనీలో ట్యూషన్‌కు వెళుతున్న ఇద్దరు విద్యార్థుల పై దాడికి యత్నిస్తే , స్థానికులు అడ్డుకున్నారు. ఇలా తరుచూ జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. కనీసం ఫిర్యాదు చేసినా స్పందన లేదని వాపోతున్నారు. కుక్కలు గుంపులుగా తిరుగుతుండడంతో విద్యార్థులు పాఠశాలకు, సాయంత్రం బయటకు వెళ్లాలన్నా భయపడాల్సి వస్తోందని ప్రజలు చెబుతున్నారు. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

హెచ్‌సీయూలో జాయింట్ టీచింగ్ ప్రోగ్రాం ప్రారంభం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అంతర్జాతీయ జాయింట్ టీచింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని యునెస్కో చైర్ ఇన్ వల్నరబిలిటీ స్టడీస్ ఆధ్వర్యంలో క్వీన్స్ యూనివర్శిటీ బెలాఫాస్ట్ (క్యూయూబీ)లోని స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ సహకారంతో హెచ్‌సీయూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు మాట్లాడుతూ హెచ్‌సీయూ ఆధ్వర్యంలో ఏకైక ఉమ్మడి బోధనా కార్యక్రమంగా దీన్ని అభివర్ణించారు. హెచ్‌సీయూ యునెస్కో చైర్ ఇన్ వల్నరబిలిటీ స్టడీస్ ప్రొఫెసర్లు ప్రమోద్ కే నాయక్, అన్నా కురియన్ పాత్ర ఎంతో ఉందని, భవిష్యత్తు లో కూడా ఇలాంటి పాత్రలను పోషించాలని సూచించారు. భారతీయ, ఐరిష్ విద్యార్థులందరూ కలిసి పనిచేయడం వల్ల నిజమైన విద్యా అనుభవం కలుగుతుందన్నారు.

కిరాణా దుకాణంలో అగ్నిప్రమాదం

రూ.30 లక్షల ఆస్తినష్టం



గచ్చిబౌలి: షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా దుకాణం దగ్ధమైన సంఘటన రాయదుర్గంలో చోటు చేసుకుంది. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ మహేష్ తెలిపిన వివరాలు.. మంగళవారం తెల్లవారుజామున రాయదుర్గంలో జైభవాని హోల్‌సేల్ కిరాణ దుకాణంను నీరుడి కిరణ్‌కుమార్ నిర్వహిస్తున్నాడు. తెల్లవారుజామున ఫ్యూజ్ బాక్సు వద్ద షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రేగి దుకాణంలో ఉన్న వస్తువులు బూడిదయ్యాయి. రూ.30 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిసింది. సకాలంలో అగ్నిమాపక కేంద్రం వారు వచ్చి మంటలార్పే ప్రయత్నం చేసినప్పటికీ మొత్తం కాలిపోయాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కామారెడ్డి జిల్లాకు చెందిన శ్రీకాంత్(45) బతుకుదెరువు కోసం ఆరునెలల క్రితం ఇస్నాపూర్ వచ్చి హనుమాన్‌నగర్ కాలనీలో నివాసం ఉంటూ, లక్కీ బాయ్స్ హాస్టల్ నడుపుతున్నాడు. ఈ నెల 3 వ తేదీ రాత్రి భవనం రెండో అంతస్తులో డోర్ కర్టన్‌కు ఉపయోగించే ఐరన్ రాడ్ కింద పడి ఉండటంతో దాన్ని తీస్తుండగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న విద్యుత్ వైర్‌కు తగిలి విద్యుదాఘాతంతో శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం పటాన్‌చెరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కి తీసుకురాగా, అక్కడ చికిత్స పొందుతూ 15వ తేదీ రాత్రి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం మృతుడి భార్య సాగరిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే సమాచారం

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే స్టేషన్ నుంచి దూర ప్రాంతాలకు బయలుదేరు రైళ్ల వివరాలు..

◆ 4.40	అమరావతి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్	లింగంపల్లి – విజయవాడ
◆ 6.15	జన్మభూమి ఎక్స్‌ప్రెస్	లింగంపల్లి –వైజాగ్
◆ 12.25	దేవగిరి ఎక్స్‌ప్రెస్	లింగంపల్లి– సీఎస్ఎంటీ (ముంబాయి)
◆ 18.25	నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్	లింగంపల్లి–తిరుపతి
◆ 18.30	కోకనాడ ఎక్స్‌ప్రెస్	లింగంపల్లి– కాకినాడ (సోమ, బుధ, శుక్ర) (19.00 మంగళ, గురు, శని)
◆ 20.30	గౌతమి ఎక్స్‌ప్రెస్	లింగంపల్లి– కాకినాడ
◆ 21.05	నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్	లింగంపల్లి– నర్సాపూర్
◆ 21.40	హంసఫర్ ఎక్స్‌ప్రెస్	లింగంపల్లి–ఇండోర్ (ఆదివారం)

ఉచిత ఆరోగ్య కేంద్రం

హఫీజ్‌పేట్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో నాదెళ్ళ లక్ష్మయ్య మెమోరియల్ ఆరోగ్యం కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. అవుట్ పేషెంట్ రూ.30లు చెల్లించాలి. ప్రతి రోజు సుమారు 25 మంది రోగులకు వైద్య పరీక్షలు చేస్తారు.